ఆయన దగ్గరుంది గాబోలు పాపం పిచ్చి కుక్కలు ఆయన్ని పట్టుకున్నాయి" అని ఆనందరావుగారి భార్య నెమ్మదిగా అంది.

—దాసు మధురభారతి

# మల్లెపందిరి

## పట్టపు వేశ్య

పట్నపు రాణియే పట్టపురాణి. పట్టం కట్టించుకున్న రాణియే అనుకోండి. అందుచేత రాజుగారి ప్రియ'రాణి'. అలాగే పట్టపు వేశ్య రాజుగారి ప్రియ వేశ్య.

ఒక నూనూగు మీసాల యువకుడు మొదటి ఆట సినిమా చూసి ఆ పెద్దింటి కొచ్చి పలకరించాడు. "ఇప్పుడు మా ఇంట్లో ఉండదగిన వేళ కాదు. యజమానిగా రాచ్చే వేళ" అంటోంది:

మార మావస మదీయ మానసే
మాధవైక నిలయే యదృచ్ఛయా।
శ్రీ రమాపతి రిహాగమేదసౌ
కః సహేత నిజ వేశ్మ లంఘనం?॥

(కృష్ణ కర్ణామృతం)

మదనా నా మనస్సులో నిలవకు. ఇది మాధవ నిలయం. గమ్మున ఆ లక్షింపతిగారు వచ్చినా వచ్చెయ్యొచ్చు. తన ఇంట్లో మరొకరు వుండడం ఎవరు సహిస్తారు?

—సౌభరి

# అనుభవం



రంగ

సరోజ లైటు వేసుకుని ముందు వరండాలో కూర్చుంది. రాజ్యం. గోపాలం 'ఫస్టుషో' సినిమా చూసివచ్చేరు. సరోజను చూస్తూ "ఇంకా నిద్రపోలేదామ్మా?" అన్నాడు మృదువుగా చెల్లెలిని గోపాలం.

"లేదు. అమ్మ 'ఫెయింట్' అయిపోయింది. గ్లూకోజ్ వాటర్ కలిపి యిచ్చేను. ఇప్పటికెలాగో తేరుకుంది. ఇప్పుడిప్పుడే నిద్రలోకి జారింది. అయినా అమ్మ ఆరోగ్యంకంటె మీకు సినిమాలే ముఖ్యం కదా! నేనుండబట్టి సరిపోయింది కాని" సరోజకంఠంలో అసహనం. నిష్ఠూరం కొంచెం తీవ్రంగానే ధ్వనించేయి.

రాజ్యం, గోపాలం మౌనంగా లోపలకు వెళ్ళేరు. తల్లిదగ్గర కాస్సేపు కూర్చున్నారు. ఆవిడ విశ్రాంతిగా నిద్రపోతోందని స్పష్టం అయేక లేచి బట్టలు మార్చుకున్నారు. భోజనాలు ముగించి పడకగదిని చేరేరు.

సరోజ పక్కగదిలోంచి ఏదో గొణుగుతూనే వుంది. రాజ్యానికి లేచివచ్చి పరిస్థితిని అర్థంచేసుకునేటట్లు జవాబు చెప్పాలని వున్నా, గోపాలం చేతుల్లో బందీ అయిన రాజ్యం కదలటానికి వీలులేకపోయింది.

* * *

సరోజకు పెళ్ళి కుదిరింది. గోపాలం యిచ్చిన కట్నం తీసుకుని పెళ్ళి ప్రకాష్ తన చెల్లెలు సుందరికిచ్చి. పెళ్ళి చేసి అత్తవారింటికి పంపించివేసేడు. ఊళ్ళోనేవున్న అత్తవారింటికి సుందరి వెళ్ళిన తర్వాతనే సరోజ అత్తవారింటికి వచ్చింది.

ఆరోజు సరోజ, ప్రకాష్‌లు ఆఫీసుల నుంచి పెందరాళే ఇంటికి వచ్చేరు. ఇద్దరూ సినిమా ప్రోగ్రాం వేసుకుని సినిమాకు తయారయ్యేరు.

ఇంతలో "బాబూ! ప్రకాష్!" అంటూ ప్రకాష్ తల్లి పిలిచింది.

"ఎందుకమ్మా?" అంటూ ప్రకాష్ తల్లి గదిలోకి వెళ్ళేడు.

"దగ్గుమందు అయిపోయిందిరా! అది తాగనిదే ఈ రాత్రికి నిద్రపట్టదు. ఆ లలితాదేవి హాస్పిటల్‌కి వెళ్ళి ఆ మందు తెచ్చి పెడతావేమోనని" ఆవిడ సన్నగా మూలుగుతూ చెప్పింది.

"ఎలాగమ్మా? ఆవిడ ఈ పాటికి శాంతి నగర్ బ్రాంచికి వెళ్ళిపోయి వుంటుంది. రేపు ఉదయమేవెళ్ళి తప్పక తీసుకువస్తాను ఇప్పుడు మేము సినిమాకు వెళుతున్నాం. ఈరోజుకి టేబిలెట్ వేసుకుని పడుకోమ్మా" అంటూ ఇవతలకు వచ్చేడు ప్రకాష్.

ప్రకాష్, సరోజ కలసి సినిమాకు వెళ్ళిపోయేరు. ఆ తర్వాత కొద్దిసేపటికి లలితానగరంనుంచి సుందరి వచ్చింది. వస్తూనే "నీ వంట్లో ఎలా వుందమ్మా? అన్నయ్య ఒదినలు ఇంకా డ్యూటీలనుంచి రాలేదా?" అంటూ ఆత్రుతగా అడిగింది.

"వచ్చేరమ్మా! వచ్చి సినిమాకు వెళ్ళిపోయేరు." ఆవిడ మెల్లగా బదులు చెప్పింది. సుందరి ఆ మాటకు బరువుగా నిట్టూర్చింది. ఆ తర్వాత లోపలకు వెళ్ళి హార్లిక్సు కనిపి తెచ్చి- ముందు టేబ్‌లెట్


# తెల్ల మచ్చల వైద్యం

## వైద్యంనుండి చక్కటి ఫలితాన్ని పొందండి



తెల్ల మచ్చల నుండి విముక్తి పొందిన వేలకొలది రోగుల నుండి ప్రశంసలు అందినవి. ఇది అంత ప్రశంసలు పొందటానికి కారణం ఏమిటంటే ట్రీట్‌మెంట్ మొదలవ్వగానే మచ్చల యొక్క రంగు మారిపోవటం మొదలవుతుంది. మరియు క్రమంగా చర్మం యొక్క రంగు వస్తూ ఉంటుంది. ఒక్కసారి సేవించిన తరువాత అది ఎంత బాగా పనిచేస్తుందో చూడండి. నిరాశ చెందిన వేలకొలది రోగులు ఈ చెడు జబ్బు నుండి విముక్తి పొందారు ఇంకా పొందుతూ ఉన్నారు. ప్రచారం కోసం ఒక ప్యాకెట్ మందును ఉచితంగా ఇస్తూ ఉన్నాం. మీరు అనేక విధాలుగా నిరాశ చెంది ఉంటారు ఒక్కసారి వాడి చూడండి. తెల్లమచ్చలు ఎంత పెద్దవో లేదా ఎన్ని రోజుల నుండి ఉన్నాయో మొదలయిన వివరాలను వ్రాయండి.

ఈ వైద్యంకోసం ముందుసు ఎవరైనా చేయవచ్చును విశ్వసనీయమైన ఫలితాన్ని చూచి మొదలెట్టండి. BHARAT AYURVEDASHRAM P. O. KATRI SARAI (GAYA)

అత్యున్నతమైన
టాంగో®
ఇంటర్నేషనల్
బ్రీఫ్స్ అండ్ బనియన్స్

వెరైటీ, రిబ్, ఇంటర్లాక్, ఇంటర్లాక్
పంపిణీదారులు :
లాల్వాని బ్రదర్స్
సిద్దియంబర్ బజార్, హైదరాబాద్-12

ఉచితం ఉచితం ఉచితం
తెల్ల మచ్చలు
ఏ రకం తెల్లమచ్చలనైనాసరే వాని రంగు మరియు ఎర్రమచ్చలరంగు మా ప్రఖ్యాత ఔషధం "డాగ్ వినాశక్" వాడిన యెడల మూడు దినములలో మారును. అటుపైన మామూలు చర్మంవలె వుండి పోవును. ప్రచారం కొరకు ఒక సీసా మందు ఉచితంగా పంపెదము. వెంటనే వ్రాయండి. Address
GAUTAM CHIKITSALAYA (S-DD)
(P.O.) KATRI SARAI (GAYA)

కావలెను
పాకిక సమయంలో శక్తి సూటింగ్ షర్టింగ్ మరియు చీరల అమ్మకం అభివృద్ధి చేయుటకు జీతం లేదా కమీషన్‌గా నెలకు రు. 700/- సంపాదించుటకు ఏజెంట్లు కావలెను. ఉచిత సాహిత్యం మరియు శాంపిల్స్ కోసం దరఖాస్తు చేయండి.
SHAKTI TEXTILES AGENCY (AJ)
Post Box No-1138, Delhi-110 006.

డా॥ పి. వి. కె. రావ్, B. A.,
వైద్యవిద్వాన్, వైద్యాచార్య, సెక్స్ స్పెషలిస్ట్

వివాహము వాయిదా వేయ నవసరంలేదు. హస్త ప్రయోగం, వరముల బలహీనత, శీఘ్ర స్కలనములకు ఆయుర్వేద చికిత్స పోస్టు ద్వారా చికిత్స కలదు.
రావుస్ క్లినిక్
టి. బి. రోడ్, తెనాలి, ఫోన్ : 700. 1010.

మింగించి, తర్వాత హార్లిక్సు తాగించింది సుందరి తల్లి చేత. హార్లిక్సు తాగి ఆవిడ విశ్రాంతిగా పడుకున్నాక - తను పుస్తకం చేతిలోకి తీసుకుంది.


రాత్రి పదయేక సరోజ, ప్రకాష్‌లు సినిమానుంచి వచ్చేరు. మంచరిని చూసి "ఎప్పుడొచ్చేవ్ ?" అంటూ ప్రకాష్ పల్కరించాడు.

"ఈ పల్కరింపులకు, మర్యాదలకేం గాని, అమ్మ ఆరోగ్యం బాగోనపుడే సినిమాకు తొందరొచ్చిందా ? సమయానికి నేను వచ్చేను కాబట్టి సరిపోయింది కాని-లేకపోతే అమ్మ ఎంత బాధపడేదో వొంటరిగా" సుందరి కంఠంలో నిష్ఠూరం ధ్వనించింది.

"సారీ! సుందరీ!" ప్రకాష్ నొచ్చుకుంటున్నట్లుగా అని తల్లి గదిలోకి వెళ్ళేడు. వెనకనే సరోజకూడా వెళ్ళింది మాట్లాడకుండా.

తాము సినిమాకు వెళ్ళినందుకు నిష్ఠూరంగా మాట్లాడినది సుందరే అయినప్పటికీ-ఒకనాటి తన అహంభావాన్ని ఎవరో దెబ్బకొడుతున్నట్లనిపించింది. ఎవరో తనకి పాఠం చెబుతున్నట్లయింది. అందుకనే మాట్లాడకుండా మౌనంగా వుండిపోయింది.

ఎప్పుడూ మాటవదని సరోజ మౌనంగా వుండటం ప్రకాష్‌కి కూడా కొంత ఆశ్చర్యాన్ని కలిగించింది. అంతేకాదు. సరోజలో 'కొత్త' సరోజ కనిపించింది ప్రకాష్‌కి. ★




సాయంత్రపు చీకట్లు నెమ్మదిగా ముసురుకొంటున్నాయి. అప్పుడే రైలు దిగి వూళ్ళో అడుగెట్టాను చేత్తో సూట్‌కేసుతో, ప్రయాణపు బడలికతో భారంగా అడుగు లేస్తున్నాను. మా యిల్లు నడకకు దూరం, రిక్షాకు దగ్గర. అంచేత రిక్షాలు కనబడక కాలుసాగించాను. సడెన్‌గా చీకటి ఆవరించింది. టౌనంతా. లైట్లు పోయినట్లున్నాయి. నెమ్మదిగా తడుముకుంటూ అడుగులు వేస్తున్నాను. కరెంటువారి దయ ఎప్పుడొస్తుందో తెలీక లైట్లు లేకపోవటంచేత జనం తిరుగుతున్నా సందడిలేదు.

ఇంకా రెండుమూడు సందులు తిరిగితే కాని కొంపరాదు. ఒక సందుమలుపు తిరిగే సరికి గాబరాగా ఒక మ్మాయి వచ్చి ఢీకొట్టింది. పడబోయి తమాయించుకున్నాను.

"క్షమించండి చూసుకోలేదు." గాభరాగా మాట్లాడుతున్నది.

"ఫరవాలేదులేమ్మా !" నెమ్మదిగా ముందుకు సాగబోయాను.

"ఏమండీ!ప్లీజ్!వెళ్ళొద్దండీ!" దాదాపు అరిచినంత పని చేసింది. ప్రశ్నార్థకంగా చూస్తూ నిలబడ్డాను.

"నన్నొక ముఠా తరుముతున్నదండీ ! ప్లీజ్ ! వాళ్ళు దూరంగా పోయేదాకా మీతో వస్తానండీ !" ప్రాధేయపడుతూ అనుసరించింది.

"దానేమ్ముందమ్మా ! అలాగే రా !" వెనక పరిశీలించి చూస్తూ అన్నాను. నడక సాగించాము.

"ఒరేయ్ ! ఎవర్నో పట్టిందిరోయ్ !" వెనకనుంచి వచ్చిన గుంపులోంచి ఒక కంఠస్వరం.

"ఎవడైతేనేం ? మన తడాఖా రుచి చూస్తాడు" మరో పెళుసుగొంతు.

ఆగి పరకాయించి చూశాను. అయిదారుగురుంటారు గ్యాంగు. వాళ్ళకు శారీరకంగా జవాబు చెప్పగలనా ! సందిగ్ధంలో పడ్డాను యాభయ్యోపడిలోపడ్డ నేను. నా వెనకాల నిలబడి బితుకు బితుకుమని చూస్తోందా పిల్ల.

"ఏయ్ ముసలాయనా ? ఆ పిల్లను మాకొదిలి నీ దారిన నీవు పో లేకపోతే పచ్చడయిపోగలవ్" వాళ్ళల్లోంచి ముందుకు వచ్చిన ఇందాకటి గొంతు ముఖంలో ముఖం పెట్టి చూస్తూ అంది.

జిగేలుమని లైట్లు వెలిగాయి. ఎదురుగా చూసి నిర్ఘాంతపోయాను. అంతకన్న కంగారుగా నన్ను చూడగానే "పదంర్రా పోదాం"అంటూ నీరసంగాజారుకున్నాడు. నాయకుణ్ణనుసరించారు తక్కిన జనం. ఆశ్చర్యపడటం ఆ అమ్మాయి వంతయింది.

"ఎవడండీ వాడు ! మిమ్మల్ని చూడగానే పలాయనం చిత్తగించాడు ?" అడిగింది ఆదుర్దాగా ఆ అమ్మాయి.

"వాడా ! వాడు నా సుపుత్రుడు" సూటిగా చెప్పలేక తలవంచుకు నిలబడాను.

నిర్ఘాంతపోవటం ఈసారి అమ్మాయి వంతయింది. ●